నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence

www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

nipuna
Every Wednesday Free Supplement

03.
31 జూలై 2024
పేజీలు 8

**మిస్టర్ బీస్ట్**

జిమ్మీ డొనాల్డ్‌సన్ అలియాస్ మిస్టర్ బీస్ట్ యూట్యూబ్‌లో అత్యధిక సబ్‌స్క్రైబర్లు కలిగిన యూట్యూబర్‌గా రికార్డు సృష్టించాడు. మ్యూజిక్ కంపెనీ టీ-సిరీస్‌ను అధిగమించి ఆయన చానల్ ఈ ఘనత సాధించింది. అమెరికాకు చెందిన డొనాల్డ్‌సన్ ఈ రికార్డు వివరాలను జూన్ 2న వెల్లడించాడు. గణాంకాల ప్రకారం మిస్టర్ బీస్ట్‌కు 26,67,07,995 మంది సబ్‌స్క్రైబర్లు, టీ సిరీస్‌కు 26,67,06,387 మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వం.. భారతదేశ నాగరికత లక్షణం

## ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద కొనసాగిన విధానం

గ్రూప్-1 ప్రత్యేకం

జనరల్ స్టడీస్

- ప్రపంచ సంస్కృతుల్లో భారతదేశ సంస్కృతి ఒక విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉంది. సంస్కృతి అనేది మానవ జీవన విధానాన్ని, సామాజిక స్థితిగతులను ప్రతిబింబిస్తుంది. యునెస్కో నిర్వచనం ప్రకారం ఒక సమాజ స్వభావ సమ్మిళిత సమ్మేళనమే సంస్కృతి. కళలు, సాహిత్యంతో పాటు జీవన విధానం, ఆచార సంప్రదాయాలు, విలువలు, హక్కులు, బాధ్యతలు వంటి సంస్కృతిలో అంతర్భాగాలు.
- ప్రాచీన ఈజిప్ట్, మెసపటోమియా, గ్రీకు సంస్కృతులు తమ అస్థిత్వాన్ని కోల్పోతున్న నేపథ్యంలో భారతీయ సంస్కృతి మాత్రం ప్రాచీన కాలం నుంచి నేటి వరకు నిరంతరం కొనసాగుతూనే వస్తుంది. ప్రాచీన కాలం నుంచి భారతీయ సంస్కృతిని అనేక నాగరికతలు, సంస్కృతులు ప్రభావితం చేసినప్పటికీ భారతీయ సంస్కృతి తన అస్థిత్వాన్ని, గొప్పతనాన్ని కాపాడుకుంటూ వస్తుంది.
- దాదాపు 5 వేల సంవత్సరాల చరిత్రగల భారతదేశంలో జాతి, భాష, మతపరమైన భిన్నత్వంతో కూడిన ప్రజలు విభిన్న రకాల జీవన విధానాలను కొనసాగిస్తున్నారు. భారతీయ సంస్కృతి, నాగరికతల విశిష్ట లక్షణం భిన్నత్వంలో ఏకత్వం. భారతదేశంలో సాంస్కృతిక సమైక్యత అంతర్గతంగా, అంతర్లీనంగా కొనసాగుతుంది. భారతదేశ చారిత్రక ఆధారాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాల్లో తాత్విక సమైక్యత స్పష్టంగా వ్యక్తమవుతుంది. హిందూమత గ్రంథాలతో పాటు బౌద్ధ, జైన మత గ్రంథాల్లో కూడా మతపరమైన తాత్వికత, మతసామరస్యం, అహింస, మానవతా విలువలు, ధర్మం, న్యాయం, దయ, దాన గుణం వంటి ఉన్నతమైన ఆదర్శాలు కనిపిస్తాయి.
- భారతీయ సంస్కృతి, నాగరికతలను మధ్యయుగంలో ఇస్లాం మతం, ఆధునిక యుగంలో క్రైస్తవ మతం ప్రభావితం చేశాయి. మధ్యయుగంలో కబీర్, నానక్ వంటి భక్తి ఉద్యమకారులు, అక్బర్ వంటి రాజులు పరమత సహనం, దాన ధర్మం గురించి ప్రచారం చేశారు. ఆధునిక కాలంలో క్రైస్తవ మతం సామాజిక సమానత్వం, సేవతత్వాన్ని ప్రచారం చేసింది.
- హరప్పా సంస్కృతి, జీవన విధానం నేటికీ కూడా విభిన్న రూపాల్లో కొనసాగడం భారతదేశ సంస్కృతి అవిచ్ఛిన్నత కొనసాగింపునకు నిదర్శనం. హరప్పా ప్రజలు అమ్మతల్లిని పూజించిన తీరులోనే నేటికీ గ్రామదేవతలను పూజించడం కనిపిస్తుంది. హరప్పా కాలం నాటి పశుపతి, ఆర్యుల కాలంలో రుద్రదేవుని రూపంలో ఆధునిక కాలంలో ఈశ్వరుని రూపంలో పూజించడం ప్రాచీన కాలం నాటి మత గొప్పతనాన్ని వివరిస్తుంది. హరప్పా సాంస్కృతిక వారసత్వం పట్టణ నిర్మాణానికి సంబంధించిన గ్రిడ్ ప్లానింగ్ రూపంలో నేటికీ కొనసాగుతుండటం హర్షించదగ్గ విషయం.
- భారత సాంస్కృతిక వారసత్వాన్ని సుసంపన్నం చేయడంలో ఆర్యులు కీలక పాత్ర పోషించారు. ఆర్యుల కాలం నాటి సంస్కృత భాష ప్రస్తుతం ఉత్తర భారతదేశంలో కొనసాగుతున్న భాషలకు, అనేక



ఇతర యూరోపియన్ భాషలకు మూల భాష అని భాషాశాస్త్రవేత్తలు నిరూపించారు. ఆర్యుల కాలం నాటి మతపరమైన యజ్ఞయాగాలు, కర్మకాండలు, ఉపనయన సంప్రదాయం, వర్ణవ్యవస్థ (కుల వ్యవస్థ) నేటికీ కొనసాగుతుండటం భారతదేశ సాంస్కృతిక వారసత్వ సంపదకు నిదర్శనం. బౌద్ధ మతం అందించిన అష్టాంగ మార్గ సిద్ధాంతం, మధ్యేమార్గ సిద్ధాంతం, అహింసా సిద్ధాంతం, గాంధార, మధుర, అమరావతి శిల్పకళారీతులు. అజంతా, ఎల్లోరా, ఎలిఫెంటా గుహల్లో బౌద్ధమతానికి సంబంధించిన సజీవ చిత్రకళ, వాస్తు శిల్పకళా నైపుణ్యాలు నేటికీ సజీవ సాక్ష్యలుగా కొనసాగుతున్నాయి.

- భారతీయ శిల్పకళకు ముఖ్యంగా మధుర శిల్పకళ అభివృద్ధికి జైన మతం అనేక విధాలుగా కృషి చేసింది. జైనం అహింసా సిద్ధాంతానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు గొప్ప శిల్పకళాభివృద్ధికి (మౌంట్ అబూ, దిల్వారా జైన దేవాలయాలు, శ్రావణ బెలగోళలో గోమతేశ్వర విగ్రహం) గుజరాతీ, మరాఠీ భాషల అభివృద్ధికి కృషి చేయడం జరిగింది.
- ఇండో గ్రీకులు, కుషాణులు, శకులు, పార్థియన్లు వంటి విదేశీ పాలకుల గ్రీకు, రోమన్ సంప్రదాయాల ప్రభావంతో భారతదేశంలో ఇండో గ్రీకు ఇండో రోమన్ సంప్రదాయాలు ఆవిర్భవించాయి. గాంధార, మధుర శిల్పకళలో గ్రీకు రోమన్ కళా సంప్రదాయాలను ప్రవేశ పెట్టి భారతీయ శిల్పకళను విలక్షణంగా మలిచారు. భారతీయ కళలు, సంస్కృతి, సాహిత్యం, మతం, గుప్తుల కాలంలో అత్యున్నత దశకు చేరుకోవడం వల్ల భారతదేశ చరిత్రలో గుప్తుల కాలాన్ని స్వర్ణయుగం అని పేర్కొంటారు. గుప్తుల కాలంలో వైదిక మతం సంపూర్ణ హిందూమతంగా రూపాంతరం చెందింది. యజ్ఞయాగాలకు బదులు భక్తి, అవతార, అహింసా సిద్ధాంతాల ఆధారంగా వైష్ణవ మతం ప్రాచుర్యంలోకి వచ్చింది. గుప్తుల శిలాశాసనంలో దశాంశ పద్ధతిని వాడారు. ఆర్యభట్ట తన ఆర్యభట్టీయం, సూర్యసిద్ధాంతం వంటి గ్రంథాల్లో ఖగోళ శాస్త్రానికి సంబంధించి నేటి శాస్త్రవేత్తలు అంగీకరిస్తున్న అనేక కొత్త విషయాలను పొందుపర్చారు.
- వరాహమిహిరుడు తన బృహత్ సంహితలో చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతాడని, భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుందని వివరించాడు. గణాంకాల్లో కీలకమైన సున్నాను, అంకెల విధానాన్ని భారతీయులే కనిపెట్టారు. భారతీయ సంప్రదాయక వైద్య శాస్త్రం ఆయుర్వేదం నేటికీ దేశంలో ప్రధాన వైద్య విధానంగా కొనసాగుతుంది. సుశ్రుతుడు తన సుశ్రుత సంహితలో క్యాటరాక్ట్ ఆపరేషన్, స్టోన్ డిసీజెస్ గురించి వివరించాడు. చరకుడు తన చరక సంహితలో వివిధ రకాలైన జ్వరాల గురించి, క్షయ, కుష్టు, మూర్ఛ వంటి అనేక రకాల వ్యాధుల గురించి, వాటి చికిత్సా పద్ధతుల గురించి వివరించాడు. ప్రాచీన కాలం నాటి జోతిష్య శాస్త్రం నేటికీ ఆచరణలో ఉండటం భారతీయ వారసత్వ సంపదకు నిదర్శనం.
- మధ్యయుగంలో భారతదేశంలోకి ఇస్లాం ప్రవేశించడంతో ఇండో ఇస్లామిక్ మిశ్రమ సంస్కృతి ఆవిర్భవించింది. ముస్లింలు పర్షియన్ కమానులు (ఆర్చ్‌లు), గుమ్మటాలు/అర్ధగోళాలు (డోమ్స్), మినరేట్‌లను భారతదేశంలో ప్రవేశ పెట్టారు. హిందూ వాస్తు శిల్పకళలోని పద్మం, వృక్షాలు, జంతువులు వంటి అలంకరణాంశాలను ఇస్లామిక్ వాస్తు శిల్పకళల్లో ఉపయోగించారు. ఫిరోజ్ షా తుగ్లక్ కాలంలో అనేక సంస్కృత గ్రంథాలు పర్షియన్ భాషలోకి అనువదించారు. రాగదర్పన్ అనే భారతీయ సంప్రదాయ సంగీత గ్రంథాన్ని పర్షియన్ భాషలోకి అనువదించారు.
- ఇండో-ఇస్లామిక్ మొఘలుల కాలంలో అత్యున్నత దశకు చేరుకుంది. ఫతేపూర్ సిక్రీలోని పంచమహల్ భవన నిర్మాణంలో హిందూ వాస్తు శిల్పకళ ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఈ నిర్మాణంలో హిందూ మతానికి సంబంధించిన కలశాలు, రుద్రాక్ష మాలలు స్పష్టంగా కనిపిస్తాయి. కట్టడ నిర్మాణం మొత్తంగా హిందూ రాజదర్బార్ మాదిరిగా కనిపిస్తుంది. ఆగ్రా (షాదావ్)లోని అక్బర్ సమాధి హిందూ, బౌద్ధ, జైన, ఇస్లాం వాస్తు శిల్పకళల కలయికగా నిర్మించారు. తాజ్‌మహల్ నిర్మాణంలో పుష్పాలు, వృక్షాలు వంటి అలంకరణాంశాలు స్పష్టంగా కనిపిస్తాయి.
- జహంగీర్ కాలాన్ని భారతీయ చిత్రకళకు స్వర్ణయుగమని పేర్కొంటారు. గొప్ప చిత్రకళాభిమాని అయిన జహంగీర్ అబ్దుల్ హసన్, ఉస్తాద్ మన్సూర్ వంటి ముస్లిం చిత్రకారులతో పాటు బసవన్ బిషాన్‌దాస్, గోవర్ధన్ వంటి హిందూ చిత్రకళాకారులను కూడా ఆదరించారు. వీరు పర్షియన్, హిందూ, చైనీ, యూరోపియన్ చిత్రకళా శైలుల సమ్మేళనంతో అత్యంత నైపుణ్యంగా మొఘల్ చిత్రకళను రూపొందించారు.
- భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు వివిధ దశల్లో వికాసం చెందుతూ కొనసాగుతుంది. ప్రాచీన కాలంలో హిందూ సంప్రదాయాలు, మధ్యయుగంలో ఇస్లాం సంప్రదాయాలు (ఇండో-ఇస్లామిక్) ఎక్కువగా, ఆధునిక కాలంలో బ్రిటిష్ ప్రభావం కొంతవరకు భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద కొనసాగింపునకు దోహదపడింది.

### భారతీయ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద-చిత్రకళ

- భారతీయ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదలో చిత్రకళకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. భారతీయ పురాణాలు, ఇతిహాసాలు, ఇతర మతపరమైన, సాహిత్యపరమైన గ్రంథాల్లో అదేవిధంగా వాత్సాయనుడు రచించిన కామసూత్ర గ్రంథంలో చిత్రకళను ఒక ముఖ్యమైన కళగా గుర్తించారు. మానవుని సృజనాత్మక ఆలోచనకు, ప్రకృతితో మానవుడికి ఉన్న అనుబంధాన్ని వివరించడానికి చిత్రకళ ఒక సాధనంగా ఉపయోగపడుతుంది.
- దేశంలో చిత్రకళకు సంబంధించిన ఆధారాలు నవీన శిలాయుగానికి చెందిన ఆది మానవుడు తను నిత్యం గమనించే దృశ్యాలను, ప్రకృతిని, పులిని, ఎలుగుబంటిని చిత్రాల రూపంలో గుహల్లో, కొండరాళ్లపై గీసి ఆనందించేవాడు. శిలాయుగానికి సంబంధించిన చిత్రకళకు చెందిన ఆధారాలు భోపాల్ సమీపంలోని భీమ్‌బెట్కా, రాయ్‌గఢ్ కొండ ప్రాంతాల్లోని జోగిమర గుహల్లో నేటికీ కనిపిస్తాయి.
- సింధూ నాగరికత కాలంలో చిత్రకళకు సంబంధించిన ఆధారాలు మట్టికుండలపై గీసిన చిత్రాల రూపంలో లభించాయి. చెట్ల ఆకులు, వృక్షాలు, మేకలు, నెమళ్లు, సింహాలు వంటి జంతువుల చిత్రాలు సహజత్వాన్ని ప్రతిబింబించేలా చిత్రీకరించారు.
- ప్రాచీన కాలానికి చెందిన చిత్రకళకు సంబంధించిన ఆధారాలు గోడలపై, గచ్చుపై వేసిన చిత్రాల రూపంలో లభించాయి. సహజసిద్ధమైన రాళ్లు, మట్టితో ఎరుపు, ఆకుపచ్చ, పసుపు, తెలుపు, బూడిద రంగులను తయారు చేసుకుని చిత్రాలను చిత్రించేవారు. అజంతా గుహల్లో బుద్ధుని జీవిత చరిత్రకు సంబంధించిన అంశాలను చిత్రీకరించారు.
- వాత్సాయనుడి కామసూత్రలో చిత్రకళకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన సూత్రాలను వివరించారు. కుచ్చును ఉపయోగిస్తూ రంగులు వేయడంలో నేర్పరితనం (వర్ణికా భంగం), మనసును రంజింపచేసే అందాలను, సొగసును వర్ణించే చిత్రలేఖనం 'లావణ్యయోగనం', వివిధ రూపాల మధ్య తేడాను చిత్రీకరించడం 'రూపభేదం', సరైన గ్రహణ శక్తి, కొలత, ఆకారాలను చిత్రీకరించడం 'ప్రమాణం', భావపూరితమైన వాత్సల్యంతో కూడిన ఆకారాలను చిత్రీకరించడం 'భావం', ఉపమాలంకారం ఉపయోగించి చిత్రీకరించడం 'సాదృశ్యం' వంటివి నాటి చిత్రకళలో కనిపిస్తాయి.
- చిత్రలేఖనంలో కాలక్రమంలో అనేక పరిణామాలు సంభవించాయి. చిత్రలేఖన సూత్రాలకు సాంకేతికత అనుసంధానించడంతో వివిధ రకాల చిత్రలేఖనాలు ఆవిర్భవించాయి. ఉదా: పత చిత్రాల, లేప్య చిత్రాలు, దూలి చిత్రాలు, లేఖ్య చిత్రాలు. చిత్రలేఖనం సమాజంలో ఒక అవసరమైన కళగా, నాగరికతకు చిహ్నంగా పరిగణించబడింది. అంతేకాకుండా రాజులు మొదలుకొని సామాన్య ప్రజల వరకు ఈ కళ ఒక అవసరంగా గుర్తించబడింది.
- అజంతా గుహల్లోని చిత్రాల్లో చెట్లు, పూలు, జంతువులు వంటి ప్రకృతికి సంబంధించిన చిత్రాలతో పాటు పురాణాల్లో పేర్కొన్న గరుడ, యక్ష, గంధర్వ చిత్రాలు కూడా చిత్రీకరించారు. ఈ గుహల్లో చిత్రీకరించిన చిత్రాల్లో కరుణ రసం మూర్తీభవించిన డైయింగ్ ప్రిన్సెస్ చిత్రం, తల్లీబిడ్డను సముదాయించే చిత్రం ఆకట్టుకుంటుంది.
- ఢిల్లీ సుల్తానుల కాలంలో పర్షియన్, భారతీయ చిత్రకళా పద్ధతులు సమ్మేళనంతో నూతన పద్ధతిని అవలంబించింది. మొఘలు చిత్రకారులు నిలువెత్తు మానవ చిత్రపటాలను చిత్రించడంలో నైపుణ్యాన్ని పొందారు. మొఘల్ చక్రవర్తులైన బాబర్, హుమాయూన్ పర్షియన్ చిత్రకళ శైలికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అక్బర్ కాలంలో ప్రముఖ చిత్రకారులైన మీర్ సయ్యద్ అలీ, ఖాజా అబ్దుస్ సయ్యద్, బసవాన్, దశవంత్ వంటి వారు పర్షియన్, భారతీయ చిత్రకళల సమ్మేళనాన్ని అనుసరించి చిత్రకళను అభివృద్ధి చేశారు. అబుల్ ఫజల్ రచించిన 'అక్బర్‌నామా' గ్రంథంలో దాదాపు వందకు పైగా చిత్రాలను చిత్రీకరించారు. షాజహాన్ కాలంలో చిత్రకళ సాంకేతికపరంగా సంపూర్ణతను సాధించింది.
- రాజపుత్ర చిత్రకళలో మేవార్, మార్వార్, కిషన్‌గఢ్, జైపూర్, కాంగ్రా, పహరీ, బుండీ, కోటా, గులేర్ చిత్రకళలు విభిన్న రూపాల్లో కొనసాగాయి. మేవార్ చిత్రకళ 17వ శతాబ్దం వరకు కొనసాగినట్లు రాగమాల చిత్రాల ద్వారా తెలుస్తుంది. ఈ చిత్రకళలో రామాయణ, భాగవతాల్లోని సన్నివేశాలు, ప్రకృతికి సంబంధించిన దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తాయి. 18వ శతాబ్దంలో కిషన్‌గఢ్ చిత్రకళ రాజపుత్ర చిత్రకళ చరిత్రలో ముఖ్యమైన కేంద్రంగా గుర్తింపు పొందింది. కాంగ్రా, పహరీ చిత్రకళలో మనోభావ విశ్లేషణ ప్రతిబింబిస్తుంది.
- దక్కన్ సంప్రదాయ చిత్రకళ మొఘలుల కాలం నాటి చిత్రకళకు సమకాలీనమైనదిగా గుర్తింపు పొందింది. ఈ చిత్రకళ సాంకేతిక, సంప్రదాయ తీరుతెన్నులను విజయనగర శైలి నుంచి, బహమనీ సంప్రదాయాల నుంచి ప్రభావితమైంది. గోల్కొండ సుల్తానుల కాలంలో అబుల్ హసన్ తానీషా చిత్రకళకు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. ఈ చిత్రకళలో రాజుల అభిరుచులు వ్యక్తమయ్యేవి. గోల్కొండ చిత్రకళ శైలి అనంతర కాలంలో హైదరాబాద్ చిత్రకళగా పరిణామం చెందింది.
- జానపద చిత్రకళకు ప్రతిరూపమైన మధుబని చిత్రలేఖనంలో గ్రామస్థుల ఇళ్ల మట్టి గోడలపై జానపద కథలను చిత్రించారు. మధుబని జానపద కళల్లో దేవుళ్లకు, దేవతలకు మానవ రూపం ఆపాదించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో నూలు వస్త్రాలపై చిత్రాలను కళంకారీ రూపంలో చిత్రించారు.
- ఆధునిక కాలంలో రవీంద్రనాథ్ ఠాగూర్, నందలాల్ బోస్, జెమిని రాయ్, అమృత షేర్గిల్, ఎంఎఫ్ హుస్సేన్, సతీష్ గుజ్రాల్, శోభా సింగ్, ఎన్ఎస్ బింద్రే, లక్ష్మణ్ గౌడ్, సుధీర్ పట్వర్ధన్ వంటి చిత్రకారులు భారతీయ చిత్రకళకు జీవం పోసి అంతర్జాతీయ స్థాయి గుర్తింపును తెచ్చారు.

**నూతనకంటి వెంకట్**
పోటీ పరీక్షల నిపుణులు
ఆర్గనైజింగ్ సెక్రటరీ
గ్రూప్-1 అధికారుల సంఘం
9849186827

